క్లుప్తంగా

ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదల తొలగింపును పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మలత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలోని ఖాళీ స్థలంలో పెరిగిన ముళ్లపొదలను గురువారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఇటీవల గ్రామ శివారులో ఆట స్థలం కేటాయించిన స్థలంలో ముళ్లపొదలు పెరిగి ఇబ్బందిగా ఉన్న క్రమంలో మాజీ కార్పొరేటర్ వెంగల పద్మలత అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందించారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌తో ముళ్లపొదల తొలగింపు చేపట్టారు.

వైభవంగా రావుల మల్లన్న పట్నాలు



జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరావుల మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్నాలు, బోనాలు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఒగ్గు పూజారులు ఒగ్గుడోలు చప్పుల మధ్య పట్నం వేసి మల్లన్న జీవిత చరిత్రను ఒగ్గు కథగా భక్తులకు వినిపించారు. భక్తులు మల్లన్నస్వామికి పట్నంపై మొక్కులు చెల్లించారు. ఉత్సవాల్లో యాదవ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి వారి ఆధ్వర్యంలో సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం చందనాపూర్ లో 28న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్జీ–2 జీఎం వెంకటయ్య తెలిపారు. ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిష్ణాతులైన సింగరేణి వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు డీజీఎం పర్సనల్ అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ గురువారం తెలిపారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

ఎలిగేడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ వారు డబ్బులు పంచినా ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా దేశంలో ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచాలనే ఉద్దేశంతో బీజేపీ అభ్యర్థులకు స్వచ్ఛందంగా ఓటు వేశారని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు రంజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ ధర్మకర్తలు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి హుండీలను గురువారం ఆలయ ధర్మకర్తలు లెక్కించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి తరలి వచ్చిన భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించగా రూ.1,38,520 నగదు వచ్చినట్లు ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు మల్లేశం, రమేశ్, శంకరయ్య, అనిల్, శ్రీనివాస్, వెంకటరమణ, డాక్టర్ సత్యం, ఆలయ పూజారి ఉద్దండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- ప్రభావిత ప్రాంతంపై చిన్నచూపు
- ఇబ్బందుల్లో అన్నపూర్ణకాలనీవాసులు
- ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్



గుంతలమయంగా ఉన్న రోడ్డు



రోడ్డు మధ్యలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కుండీలు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌ను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తామని పేర్కొంటున్న మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు అన్నపూర్ణకాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కనిపించని అభివృద్ధి జాడ..

ఎన్టీపీసీ రామగుండం విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూనిర్వాసితుల నివాసాల కోసం అన్నపూర్ణకాలనీలోని కొంత భాగాన్ని సంస్థ కేటాయించింది. పునరావాస ప్రాంతంగా ఉన్న కాలనీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. కాగా ఇక్కడ మాత్రం అభివృద్ధి పనుల జాడ కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలనీలోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి రోడ్డు వేయకపోవడంతో రోడ్డు మధ్యలో ఉన్న కుండీలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి.

ప్రభావిత ప్రాంతంపై ఎన్టీపీసీ చిన్నచూపు

ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం ప్రభావిత, పునరావాస ప్రాంతాలను పట్టించుకోవడం లేదని సంబంధిత ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంస్థ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రభావిత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటు అభివృద్ధి చెందుతున్న క్రమంలో సీఎస్సార్ నిధులను అదే మొత్తంగా విడుదల చేయాల్సి ఉండగా తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నపూర్ణకాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ఎప్పుడు వేస్తారు



మా ఇంటికి పోవాలంటే రోడ్డు సక్కగా లేదు. డ్రైనేజీ వేశారు. కుండీలు ఎత్తుగా ఉన్నాయి. వాటితో ఇబ్బంది పడుతున్నాం. ఎన్టీపీసీ అధికారులు మాకు సౌకర్యాలు కల్పించాలి.

– నర్సమ్మ, అన్నపూర్ణకాలనీ

సౌకర్యాలు కరువు



మున్సిపల్ వాళ్లకు పన్నులు కడుతున్నం. కానీ మాకు సౌకర్యాలు కల్పించడం లేదు. ఎన్టీపీసీ అధికారులు పట్టించుకోవట్లేదు. రోడ్డు మధ్యలో ఉన్న డ్రైనేజి కుండీలతో ఇబ్బంది పడుతున్నం.

– లక్ష్మి, అన్నపూర్ణకాలనీ

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



పాలకుర్తి: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అబ్జర్వర్ మహేశ్ దత్



పెద్దపల్లిరూరల్: ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులు



రామగుండం: అంతర్గాం పోలింగ్ కేంద్రం వద్ద ఏసీపీ, ఆర్డీవో



ఎలిగేడులో క్యూలో ఉన్న ఓటర్లు



సుల్తానాబాద్: పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లో నిల్చున్న ఓటర్లు



ఓదెలలో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు/సుల్తానాబాద్/ధర్మారం/కమాన్‌పూర్/కాల్వశ్రీరాంపూర్/రామగుండం/రామగిరి/ఓదెల/పాలకుర్తి/ముత్తారం: జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు కల్పించారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా వీల్‌చైర్ ఏర్పాటు చేశారు. చాలా మంది మహిళలు చంటి పిల్లలతో వచ్చి ఓటు వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాల్వశ్రీరాంపూర్‌లో క్యూలో ఉన్న మహిళలు



ముత్తారంలో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ కేంద్రాల సందర్శన



కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే ఎంఎస్‌రాజ్‌ఠాకూర్ సందర్శించారు. గోదావరిఖని, రామగుండం, పెద్దంపేట్, బసంత్‌నగర్ కేంద్రాలను పరిశీలించి కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఏజెంట్లను బెదిరించిన కాంగ్రెస్ ప్రతినిధులు



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

రామగుండం/సుల్తానాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు శృతిమించిపోయామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆరోపించారు. గురువారం అంతర్గాంలో మాట్లాడారు. అంతర్గాం కేంద్రంలో బీజేపీ అభ్యర్థి తరఫున ఏజెంట్‌ను అధికార పార్టీ నేత బెదిరించడంతో మరో ఏజెంట్‌ను నియమించడం జరిగిందన్నారు. అధికార పార్టీకి పోలీసు యంత్రాంగం కొమ్ము కాస్తోందని విమర్శించారు. జరిగిన ఘటనపై ఆర్డీవో గంగయ్య, కలెక్టర్ కోయ శ్రీహర్ష, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తూ, కేంద్ర మంత్రి సంజయ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయమై గోదావరిఖని ఏసీపీ రమేశ్, పెద్దపల్లి ఆర్డీవోను వివరణ కోరగా బీజేపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, పార్టీలతో అధికార యంత్రాంగానికి ఏలాంటి సంబంధం లేదని సమాధానమిచ్చారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, తదితరులున్నారు. అలాగే సుల్తానాబాద్ పోలింగ్ కేంద్రాన్ని సంజీవరెడ్డి సందర్శించారు. నాయకులు అశోక్‌రావు, తిరుపతి యాదవ్, రాజన్న పటేల్, నాగరాజు యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో నిర్వహించిన 8ఏ సైడ్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరై పోటీలు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, హాకీ, షటిల్ తదితర క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల తోపులాట



అడ్డుకుంటున్న పోలీసులు

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ, కాంగ్రెస్ మధ్య తోపులాట జరిగింది. బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.సురేశ్ రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించేందుకు రాగా, పోలింగ్ చీటిలతో పాటు డబ్బు పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఎస్ఐ సనత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇరుపార్టీల నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సీఐ రవీందర్, ఎస్ఐ, సిబ్బంది ఇరువర్గాలను అదుపు చేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో ప్రశాంతంగా ఓటింగ్ కొనసాగింది.

పోలింగ్ పరిశీలన

ధర్మారం: మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను వాహనాల ద్వారా తరలించి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. పోలింగ్ సమయం పూర్తయ్యే వరకు కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని రైజింగ్ సన్ స్కూల్‌కు చెందిన విద్యార్థి అర్షిద్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21న కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని కరస్పాండెంట్ సయిద్ అహమ్మద్, హెచ్‌ఎం హకీం అభినందించారు. 27నుంచి మార్చి 2వ రకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అర్షిద్ పాల్గొంటాడని పేర్కొన్నారు.

సింగరేణి వార్తలు

నాణ్యమైన బొగ్గుతోనే సంస్థకు లాభాలు



వివరాలు వెల్లడిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించినప్పుడే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. బొగ్గు నాణ్యతపై గురువారం ఓసీపీ–3 అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ సుభాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బొగ్గు నాణ్యత వివరాలు వెల్లడించారు. బొగ్గులో మట్టి, షెల్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీఎం సూచించారు. బొగ్గు నాణ్యత విషయంలో రాజీలేకుండా ప్రతీఒక్కరు బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. నాణ్యత తగ్గితే ఎంత ఉత్పత్తి చేసినా సంస్థకు సరైన లాభాలు రావన్నారు. సమావేశంలో ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి ఎస్.మధుసూదన్, ఎస్‌ఓటూ జీఎం ఎం.రాముడు, వకీల్‌పల్లి గని ఏజెంట్ ఎ.నెహ్రూ, కాలరీ మేనేజర్ భరత్‌కుమార్, సర్వే అధికారి నర్సింగరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ మోసపూరిత పాలన



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్, గోమాస శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: దేశంలో నీతివంతమైన పాలన అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకే ప్రజలంతా అండగా నిలుస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ మోసపూరిత పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, నాయకుడు గోమాస శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు పోలీసుల అండతో అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నేతలపై దాడులకు పాల్పడ్డ కాంగ్రెస్ నేతలకు పోలీసులు అండగా వ్యవహరించడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు అరుముల్ల పోచం, చిలారపు పర్వతాలు, రాజ్‌గోపాల్, తంగెడ రాజేశ్వర్‌రావు, పోల్సాని సంపత్‌రావు, మేకల శ్రీనివాస్, రాకేశ్, రమేశ్, శ్రీకాంత్, కిరణ్, శంకర్, సతీశ్ పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కాల్వశ్రీరాంపూర్‌లో శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కాల్వశ్రీరాంపూర్ శివాలయంలో అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని శివాలయంలో, మొట్లపల్లిలోని లక్ష్మీగణపతి సీతారామాలయంలో, హరిహర ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండాల ఘట్టంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని అగ్ని గుండాలు దాటారు. అర్చక పూజారులు వేదమంత్రాలతో కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం వీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో మహిళలు దాండియా ఆడారు. ఆలయాలు భక్తుల ప్రత్యేక పూజలతో భజనలు, కీర్తనలతో ఆధ్మాత్మిక శోభను సంతరించుకున్నాయి. హైకోర్టు న్యాయవాది అశోక్‌రావు దంపతులు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు వంగల తిరుపతిరెడ్డి, మాదాసు సతీశ్, శ్యాం, ఆడెపు శ్రీదేవి, జిన్న రాంచంద్రారెడ్డి, నాయకులు సబ్బని రాజమల్లు, నార్ల రాజన్న, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల పరిశీలన



కాలువలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం తెలిపారు. అడవిశ్రీరాంపూర్‌లోని సాగునీరు అందించే కాలువలను గురువారం వారు పరిశీలించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు టూటీఎంసీల సాగునీరు గుండారం రిజర్వాయర్ నుంచి ముత్తారం మండలం శుక్రవారంపేట చింతల చెరువు రిజర్వాయర్ ద్వారా ఉపకాలువలతో అడవిశ్రీరాంపూర్‌లో చెరువులు, కుంటలు నింపాలని వారు కోరారు. ఈ సందర్భంగా కాలువ పరిస్థితి గురించి, సాగునీరు ఎలా అందించాలో మంత్రి శ్రీధర్‌బాబుకు ఫోన్‌లో వివరించామన్నారు. కాంగ్రెస్ నాయకులు మద్దెల రాజయ్య, తూటి రఫీ, గాదం శ్రీనివాస్, బక్కతట్ల వినిత్, అనుము సమ్మయ్య ఉన్నారు.

అమరేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా రాజేశం

ధర్మారం: మండలంలోని నందిమేడారం అమరేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆవుల రాజేశం ఎన్నికయ్యారు. ఆలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా రాజేశం, ప్రధాన కార్యదర్శిగా మానుపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దేవి కొమురేష్, ఆవుల అమరేందర్, కార్యదర్శులుగా మగ్గిడి సత్తయ్య, మిట్ట సత్తయ్య, కొలిపాక ఉమాశంకర్, మందపల్లి శివరాజ్, కొక్కుల విద్యాసాగర్, ఎల్తూరి లచ్చయ్య, బరుపటి చిలుకయ్య కోశాధికారిగా పంజాల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కట్ట సురేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.